కాదు. పార్వతి పెళ్ళి నిశ్చయమయినట్టు ఆ సాయంత్రానికే ఆయన అందరితోనూ చెప్పాడు. తనుకూడా జీవితంలో ఒక మహత్తరకార్యం సాధించగలిగినందుకు ఎంతగానో గర్వించాడు. ఆయన మనస్సులో ఉన్న వ్యధ తగ్గింది. అప్పటికి ఆయన ముఖంలో సంతోషరేఖ కనిపించింది. ఆ సంతోషంలో పార్వతి వివాహానికి ఏర్పాట్లన్నీ మంచి ఖుంజాయింపుగా చేయించాడు.

అనుకున్నట్లుగానే పార్వతి పెళ్ళి జరిగిపోయింది. చుట్టాలంతా వచ్చారు. పెళ్ళివారుకూడా పేచీ లేమీ లేకుండానే కాలక్షేపం చేశారు. పెళ్ళి కొడుకు యోగ్యుడని పదిమందీ అన్నారు. "కొంచెం ఆలస్యమయినా మంచి అల్లుణ్ణి సంపాదించా వయ్యా" అని పార్వతి ఈడు పిల్లలు పెళ్ళికున్న తండ్రులు పార్వతి తండ్రిని అభినందించారు. ఆ ఊరి అమ్మలక్కలంతా పార్వతి మొగుడి గుణ గణాలను గురించి వేనోళ్ళ పొగిడారు.

ఇన్ని ప్రశంసలు పొందిన పెళ్ళికొడుకు పెళ్ళ యిన నెలే అత్తవారిఊరు ఏదో పనిమీద వచ్చాడు. అత్తవారింట్లోనే ఉండి చూసుకుంటున్న వాడు తనఅత్తగారి నిర్బంధంవల్లనే నాలుగురోజులు ఆగాడు. ఆ వూళ్ళో ఇక వెళ్ళిపోదాంమంటుండగా ఇంకొకపనేదో తగిలింది. ఆ ఉండడం ఉండడం అప్పటినుంచీ ఇక్కడే ఉండిపోయాడు. మరి అతని చదువు ఏమయిందో, ఉద్యోగం మాటేమిటో ఇక్కడనుండి ఎప్పుడు వెడతాడో లేకపోతే అసలు వెళ్ళనే వెళ్ళాడో తెలియదు. అతనే ఇక్కడ కాలక్షేపం చేస్తున్నప్పుడు ఇక పార్వతినిఅత్త వారింటికి తీసుకెళ్ళడం అనేప్రశ్నే రాదుగా!... ఇప్పటికి అతనువచ్చి సుమారు ఏడాది దాటు తుంది. ఈ ఊళ్ళో అందరూ అతన్ని 'పార్వతి మొగుడు' అనే అంటారు. అతనిపేరు తెలుసుకునే అవకాశంగాని తెలుసుకోవలసిన అవసరంగా ఎవరికీ కలుగలేదు. అందుచేత అతను పార్వతి మొగుడు గానే చలామణి అయిపోతున్నాడు. ఈ మధ్య వాళ్ళఊరి ఆయన ఒకరు పార్వతిగారింటికి వచ్చి "సుబ్బారావు ఉన్నాడా" అని అడిగితే అసలు సుబ్బారావనే వ్యక్తి ఎవరూ లేదని ఆయింట్లోంచి జవాబిచ్చారు పార్వతి భర్తపేరు సుబ్బారావని తెలియక.

ఈ ఏడాదినుంచీ మళ్ళా పార్వతితండ్రి ముఖంలో వెనుకటి దైన్యం వ్యక్తమౌతుంది. ఏదో ఆలోచిస్తున్నట్టుగా ఉంటాడు. పార్వతి భర్త ఏం చేస్తున్నాడని ఎవరేనా ఆయన్ను అడిగితే "ప్రస్తుతం మా పార్వతికి మొగుడుగా ఉంటున్నాడు" అంటాడు.

---

కథానిక

# అర్థంకాని నేరం

"నయాగరా"

దఫేదారు బలరామయ్య జైలు ఆవరణనుండి లాఠీ వూపుకుంటూ పోతున్నాడు. వాడి ఠీవిని చూస్తూంటే రంగనాథానికీ కస్సుమన సాగింది. ఒక్కుమ్మడిగా జైలు కటకటాలనన్నింటినీ పటా పంచలుచేసి బలరామయ్యమీద దూకి పీక నొక్కెయ్య బుద్ధిపుట్టింది. తోకతొక్కిన తాచులా వున్న రంగనాథానికి వేగంగా అడుగుల్ని వేస్తూ కోపావేశంతో తూలిపోతూన్న దేహాన్ని మొదటి గేటు కటకటాలదగ్గిరికి చేర్చాడు ఎట్లాగో అట్లాగా—అక్కడే నిలబడి రెండోగేటు దాటి పోతున్న బలరామయ్యని చూసాడు. దఫేదారుని చూస్తూంటే రంగనాథం పళ్లు పటపట లాడాయి. చలికాలంకావడంచేతదవడలు లోపలికిపోయాయి.

'దఫేదారుగాడు బయటిగేటు దాటితే లాభం లేద'ని అనుకున్నాడు తనలోతాను. ఈ లోపు గానే వాడిపని పట్టేస్తే బావుండేది. ఇప్పుడు మాత్రం ముంచుకుపోయిందేముంది? ఇంకా వాడు గేటు దాటలేదు. ఇప్పటికైనా తాను కటకటాల బయటపడితే బలరామయ్య సులభంగా దొరుకు తాడు. ఈ ఆచలనతోటే రంగనాథం కటకటా లని గట్టిగా పట్టుకొన్నాడు. చువ్వలు మంచు గడ్డల్లా వున్నాయి. వాటిని పట్టుకునేసరికి రంగ నాథం ధైర్యంకూడా ముడుచుకుపోయింది. పట్టు సడలింది. మళ్లీ పట్టడానికి ప్రయత్నించాడుకాని చేతులు చలికి వణకిపోయాయి. నరాలన్నీ బిగిసి పోయి కవోష్ణాన్ని ఆశించాయి. పిండారబోసి

నట్లున్న వెన్నెట్లో అకస్మాత్తుగా చీకటి, ధారలుగా కురవడం మొదలెడ్తే ఎలావుంటుందో అలా అగుపడ్డాయి రంగనాథానికి వెన్నెట్లోవున్న చువ్వలు. జైలు బయటంతా వెన్నెల లోపలి ఆవరణలోమాత్రం లేదా? వుంది. కాని రంగనాథానికి అది వెన్నెలలా కనబడడంలే. ఒక్క రంగనాథానికేకాదు జైలు జీవైన ప్రతీవాడికంతేనేమో! దఫేదారుగాడి కాళ్లు సాగిపోతున్నకొద్దీ రంగనాథం హృదయం ఆతురతపడసాగింది.

'ఇప్పుడు తప్ప మళ్లీఎప్పుడూ వాడు తన గుప్పెట్లోకిరాడు'అని గొణుక్కున్నాడు రంగనాథం.

పళ్లు బిగపట్టి చువ్వల్ని బలంకొద్దీ సాగదీయసాగాడు. కాని అతని పిచ్చిగానీ అవి వంగుతాయా? కాళ్లని నిలదొక్కి వూపిరితిత్తుల్ని బిగబట్టి, అణువణువులోవున్న బలాన్నంతా అరచేతుల్లోకికూడ దీసుకుని మరోమాసారి ప్రయత్నించాడు. లాభంలేకపోయింది. ఈలోపల బలరామయ్య బయటిగేటుకూడా దాటేసాడు. దాంతో చతికిల బడ్డాడు రంగనాథం కటకటాల దగ్గర. 'ఒట్టి వాజమ్మని' అనుకుంటూ జుట్టు పీక్కున్నాడు. చేతులు రక్తంకారే టట్టు కరుచుకున్నాడు. ఒహసారి బిగ్గరగా ఏడుస్తే బావుంటుందనుకున్నాడు తలకాయ మోకాళ్ళమధ్య యిరికించి—అయినా ఏడవలేకపోయాడు.

ఎప్పటికప్పుడు బలరామయ్యని తందామనుకోడం తన్న లేకపోవడం. చివరికి ఏడుద్దామనుకోడం ఏడవలేక పోవడం. ఇదంతా మామూలే రంగనాథానికి. చూస్తుంటే దినచర్యలా వున్నప్పటికీ మరీ బాధగావుంది. ఈరోజు-తిట్లతో పోనిచ్చే దఫేదారు ఈ వేళ తన్నుల్దాకా వ్యవహారాన్ని పెంచాడని రంగనాథానికి కోపం. బలరామయ్య లాఠీ వీపుపై నాట్యమాడుతూంటే రంగనాథం భరించలేక బిగ్గరగా పట్టుకోడం 'ఎదురు తిరగతావట్రా ముండా వెధవ?' అని దఫేదారు మళ్ళీ తన్నడం రంగనాథానికి భరించరాని విషయాల్లా తోచాయి. ఈ రోజు అదనంగా జరిగిన సంఘటనలని నెమరేసుకుంటూంటే అతని కళ్ళలోనుండి రెండు నీటిబొట్లు రాలాయి.

'అయినా దఫేదారుగాడి తప్పేముంది. నోరు బాగుంటే వూరుబాగుంటుంది. ఇంతకి తననోరు మంచిదికాదు తన చేష్టలూకూడా అంతే' అని నిట్టూర్చాడు రంగనాథం చేతుల్లోనుండి తలని పైకి ఎత్తుతూ.

అసలు తాను దొంగకావడమే తప్పు. పైపెచ్చు జైల్లోపిండి విసరగూడదని, బట్టలుతకకూడదని తోటివాళ్ళతో సమ్మెలు చేయించడం యింకా పెద్దతప్పు. ఇదంతా చూస్తూంటే బలరామయ్య మాత్రం కళ్ళప్పగించి చూస్తూ కూర్చుంటాడా? తాను చెయ్యాల్సింది తానుచేస్తున్నాడు. ఒక్క బలరామయ్యేకాదు ఆ స్థానంలోవున్న ప్రతీవాడు తన పనుల్ని చూస్తే చావమోదుతాడు. అట్లాచేస్తే తప్పా వాడి అరవైరాళ్ళకు లోటుండదని రంగనాథానికి నింపాదిగా ఆలోచిస్తూంటే తెలిసిరాసాగింది.

"ఇంతకీ తాను దొంగకావడం తనఖర్మం—ఒహర్నంటే ఏంలాభం" అని నిట్టూర్చాడు ఎప్పుడో రాలి మంటిలో కలిసిన నీటిబిందువుల్ని చూస్తూ.

తాను దొంగయ్యాడంటే అయ్యాడు. అలాగాకుండా వుంటే తన పెళ్ళాం పిల్లలు కూటికిలేక చచ్చేవారేమో!

అంతేగాని తానుపుట్టడం పుట్టడమే దొంగగా పుట్టాలేదని థర్డుఫారం వరకూ చదివిన రంగనాథం చెప్తే ఎవరు వింటారు.

ఏ రాజకీయవేత్తగాని ఏ మనస్తత్వవేత్తగాని తాను దొంగెట్లయ్యాడని ఆలోచించరు. మొత్తానికి ప్రతీవాడు తనని 'దొంగ'ని మాత్రం అంటాడు.

"అసలు తాను దొంగెట్లయ్యాడ"ని ప్రశ్నించుకున్నాడు తనను తానే రంగనాథం. ఈ ప్రశ్నలో రంగనాథం శరీరం జలదరించింది. బుర్రలో అడుగునపడ్డ ఆలోచనలు, చిన్నప్పటినుండి జరిగిన సంఘటనలు ఒక్కొక్కటి రంగనాథం కళ్ళముందుకి తెరమీది బొమ్మల్లాసాగాయి.

* * *

తానోహామధ్య తరగతికుటుంబానికి చెందినవాడు. తనవంశ వృక్షాన్ని మొదటినుండి చూస్తే తన తాతలుగానీ, తండ్రులుగానీ ఎవరూ దొంగలు కారు. ఒహరికీ దానధర్మాలుచేసి కీర్తిగడించి బ్రతక్కపోయినప్పటికి అపకీర్తితో మాత్రం ఎవరూ చావలా. తానుగూడా గోదావరీ వరదలు వచ్చేవరకు పైలాపచ్చీసుగా బ్రతికినవాడే.

ఒకానాడు, తాను చదువుకునే రోజుల్లో మేస్టారు తనని మరోవాణ్ణి ఇంటికెళ్ళి కోటు జేబులోవున్న పెన్ను పట్టుకురమ్మన్నాడు. పెన్నునే గాకుండా జేబులోవున్న డబ్బుల్ని కూడా తనకి చూపించాడు ఆ పెంకివెధవ.

"ఒరే...డబ్బుల్ని ముట్టకూడదురా" అంటూ వాడికళ్ళలోకి బాగాచూసాడు తను. తనకిబాగా జ్ఞాపకంలేదుగానీ వాడు తనకంటెబాగాపెద్దవాడే.

"మేస్టారికే తెలిస్తే తంతార్రా"

"ఆ వాడిమొహం—వాడికిడబ్బులెక్క కూడా తెలుసూ?" అంటూ తలూపాడు వాడు.

"మేస్టారుతో చెప్తానుండు" అన్నాడు తను గబుక్కున.

"నీ బొంద! చెప్పావంటే బొమికలు విరగ తంతా" అని తన జుట్టుపట్టుకొని బాగా కుదించాడు. దాంతో తన కేడుపొచ్చినంత పనైంది. చెప్పనని ఛప్పున వాడిచేతిలో చేయేసాడు.

మర్నాడు మేస్టారు 'డబ్బులు తీసింది నీవేనటరా' అని తన చెవిని పట్టుకుని కియ్యనతిప్పాడు.

"నే కాదండీ నే కాదండీ" అని అన్నాడే గాని 'వాడని' చెప్పలా.

'మరేం తీసిందివాడా?' అన్నాడు మేస్టారు గ్రుడ్లురిమి చూస్తూ.

'వాడుకాదండీ' అన్నాడేగానీ 'వాడే—వాడే' అని తన అంతరాత్మ ఘోషించింది.

అదే తన జీవితంలో మొదటిసారిగా అబద్ధమాడడం. అదీ కూడా ఎట్లానంటే తనని వాడు తంతానన్న భయమొకటి వాడిచేతిలో చేయేసాడు కాబట్టి దాన్ని తప్పకూడదని ఒకటి — కాని మేస్టారు బెత్తానికి సమాధానం చెప్పుకోవలసిన పరిస్థితి వచ్చేసరికి నిజం వెళ్ళగక్కేడు. ఒకసారి అబద్ధమాడినప్పటికి తాను దొంగను మాత్రం కాదని అందరిముందట రుజువుచేసుకున్నానన్న తృప్తి తనకుండేది.

మరోసారి వూరిప్రక్కనున్న మామిడి తోపులోకి పళ్ల దొంగతనానికి తోటిపాళ్లంతా వెళ్లినప్పుడు తానందులో చేరలేదు. పైపెచ్చు ఆ ఆచూకిని మేస్టారికి తెలిసి వీపుతట్టించుకున్నాడు. 'మామీద సుద్దులు చెప్పడానికొచ్చాడు వెధవ' అని తలాఒక తన్ను తంతూటే ఏడ్చినప్పటికి నిజం చెప్పానన్న తృప్తిమాత్రం తనకుంటూనే వుండేది. ఇలాంటి పరీక్షల నెన్నింటినో నెగ్గాడు మొదటి నుండీ గోదావరీవరదలు వచ్చేవరకు.

కాని ఆ సంవత్సరం గోదావరితల్లి అమృతానికి బదులు హాలాహలాన్ని ప్రసాదించి-గప్పున వుప్పొంగింది. జటాధారుని ఫాలనేత్రజ్వాలల్లా తయారయ్యాయి తనపాలిట గోదావరి జలాలు. పంట పొలాలన్నీ మెట్టలేసుకపోయాయి. ఆ ఇసుక దిబ్బల్ని చూస్తూంటే పూర్వజన్మపాపరాసుల్లా కనబడ్డాయి తనకు. ఎన్నో సంసారాలతో పాటు తనదికూడా నాశనమైంది. గంపెడంత సంసారం, ఆకలిమంటల భీకర నృత్యం. ఎట్లాగో అట్లాగా ప్రాణాల్ని దక్కించుకున్నారుగాని, మానాలని దక్కించుకునేటట్లు లేదు. వూరూరా తిరిగాడు పెళ్ళాంపిల్లల్ని వెనకేసుకొని. కాని ఎన్నాళ్ళని అంతపెద్ద సంసారాన్ని భిక్షాదేవి కటాక్షాలకై ఎర పెట్టారు. పరాయివాడిదగ్గరికి భిక్షానికిగాని, పని చూపించమనిగాని పోని తాను పాలేరుగా కుదిరాడు ఒక కామందుదగ్గర. రాత్రింబవళ్లు కష్టపడ్డాడు. భార్యకేమో పిల్లలతోనే సరిపోయేది.

కలలోకూడా జరగని సంఘటన ఆనాడు జరిగింది. అది ఎట్లా జరిగిందోజరిగింది. కాని దాన్ని తలుచుకుంటేమాత్రం తనపై తనకు రోతపుట్టుకొస్తోంది. కామందు కుప్పనే కొట్టేసాడు పెద్దఎత్తున. అదే తాను జేసిన తెలివితక్కువ పని. అంతే—దాని ఫలితమే ఈ అఘోరింపు.

"ఇంటావంటా పుట్టని దొంగతనం ఎందుకు చేసాన్రా?"అని మళ్ళీ ప్రశ్నించుకున్నాడు తనను తానే. "నలుగురి నోళ్ళలో పడవలసొచ్చిందే వెధవ మెతుకులకోరకు."

మళ్ళీ అదేప్రశ్న 'తాను దొంగెందుకయ్యాడు?' ఎంతసేపటికి సమాధానం చెప్పుకోలేకపోయాడు రంగనాథం.

కామందు పూర్వచరిత్ర ఏమిటి? లంచగొండి బలరామయ్యకూడా ఓతరహాదొంగనే.చీకటిబజార్ల మూలాన లేచిన తెల్లటి మేడలను చూసుకొని మురిసే మల్లన్నగుప్తాకూడ పెద్ద తరహా దొంగని తెలిస్తే రంగనాథం జైలు కటకటాలదగ్గర కూచుని "తాను దొంగెట్లయ్యాడ"న్న ప్రశ్నతో బుద్ధిని పాడుచేసుకునేవాడుకాదు. ★